బీబీఎంపీలో అవినీతిపై లోకాయుక్తకు ఫిర్యాదు

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)లో పదేళ్ల వ్యవధిలో రోడ్ల అభివృద్ధి కోసం రూ.46,292 కోట్లలో భారీగా అవినీతి చోటు చేసుకుందని బీజేపీ నాయకుడు ఎన్‌ఆర్ రమేశ్ లోకాయుక్త ఏడీజీపీ మనీష్ ఖర్బికర్‌కు ఫిర్యాదు చేశారు. బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్‌తోపాటు పలువురు అధికారులపై ఆయన మంగళవారం ఆయన ఫిర్యాదు చేశారు. ఫ్లై ఓవర్‌లు, అండర్‌పాస్‌లు, వైట్‌ట్యాపింగ్ రోడ్లు, రింగ్ రోడ్ల పేరిట భారీగా అక్రమాలకు పాల్పడ్డారన్నారు. వేల కోట్ల రూపాయల అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.


తుంగభద్ర డ్యామ్

ప్రాజెక్టుల భద్రతకు ప్రాధాన్యం


కేఆర్‌ఎస్ డ్యామ్

- క్రస్ట్‌గేట్ల మరమ్మతులకు సిద్ధమైన సర్కార్
- రూ.10వేల కోట్ల అంచనా వ్యయం
- నివేదిక అందజేసిన జలనిపుణుల కమిటీ

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల భద్రతకు ప్రభుత్వం నడుం బిగించింది. పేరొందిన ప్రాజెక్టులన్నీ నిర్మాణాలు జరిగి ఐదు దశాబ్దాలు గడిచిపోయాయి. ఏళ్ల తరబడి ప్రాజెక్టులకు భద్రంగా నిలిచిన క్రస్ట్ గేట్లు (స్పిల్‌వే గేట్‌లు) శిథిలం అవుతూ వస్తున్నాయి. వీటికి మరమ్మతులు చేపడితే మరి కొన్నేళ్ల పాటు ప్రాజెక్టులు సురక్షితంగా ఉంటాయని రాష్ట్ర జలవనరుల విభాగం భావిస్తోంది. ఈమేరకు నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఆగస్టు నెలలో తుంగభద్ర జలాశయం 19వ క్రస్ట్ గేట్ లింక్ తెగిపోయిన విషయం తెలిసిందే. భారీగా నీరు వృథా అయ్యింది. అయితే రోజుల వ్యవధిలోనే కొత్త గేట్‌ను అమర్చారు. ప్రాజెక్టులు నిండుగా ఉన్నప్పుడు నీటి ఒత్తిడి తీవ్రంగా ఉంటుంది. ఏమాత్రం గేట్లు క్షీణించినా, మరమ్మత్తులు వచ్చినా పెనుప్రమాదం సంభవించే అవకాశాలు ఉంటాయి. ప్రాజెక్టుల గేట్లను సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఉంది. తుంగభద్ర డ్యామ్ గేట్ ఘటనతో రాష్ట్రంలోని మిగిలిన ప్రాజెక్టుల గేట్లపైనా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల గేట్ల భద్రతను పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. సదరు కమిటీ రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల స్థితిగతులను సమీక్షించారు. 50ఏళ్ల దాటిన ప్రాజెక్టుల క్రస్ట్ గేట్లను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించింది. కృష్ణా నదికి అనుబంధంగా ఉండే ప్రాజెక్టులు మినహా మిగిలిన అన్ని జలాశయాలు అరశతాబ్దం దాటినవే. ప్రమాదం రాక ముందే ముందస్తు సురక్షితమైన విధానాలు పాటించడం సముచితమని ప్రభుత్వం భావిస్తోంది. తుంగభద్ర జలాశయానికి భారీగా నీరు వచ్చింది. ఇదే సమయంలోనే క్రస్ట్ గేట్ లింక్ తెగిపోవడంతో భారీగా నీరు వృథా కావడమే కాక ఆయకట్టు రైతులు ఆందోళన పడ్డారు. పరిస్థితి ఎక్కడికి దారి తీస్తుందోనని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ఈ తరుణంలో జలనిపుణుడు కన్నయ్య నాయుడు నేతృత్వంలో క్రెస్ట్‌గేట్‌ను మరమ్మత్తులు చేయడంతో ఆంధ్ర, కర్ణాటక ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి ఉత్కంఠ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండాలంటే ముందస్తు చర్యలు చేపట్టాల్సిందేనని ప్రభుత్వం భావిస్తోంది. ప్రాజెక్టుల స్థితిగతులపై జలనిపుణులు తయారు చేసిన నివేదిక డీసీఎంకు చేరింది. వీటిలో పలు ప్రాజెక్టులకు గేట్లు మార్చాల్సిన అవసరం ఉందనే ప్రతిపాదనలు ఉన్నాయి. కావేరి, తుంగభద్రతోపాటు అన్ని నదులకు అనుబంధంగా ఉండే ప్రాజెక్టులకు గేట్లు మార్పు చేసేందుకు రూ.9-10వేల కోట్లు అవసరంగా అంచనా వేశారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ పరిధిలోని డ్యామ్ రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్ (డ్రిప్) ద్వారా ఆర్థికసాయం పొందేందుకు నిర్ధారించారు.

రాష్ట్రంలో కావేరి, కృష్ణనదులకు అనుబంధంతోపాటు తుంగ, భద్ర, నేత్రావతి నదులకు ప్రాంతాలవారీగా ప్రాజెక్టులు ఉన్నాయి. కావేరి నదికి అనుబంధంగా కేఆర్‌ఎస్, హేమావతి, కబిని, హారంగి, కృష్ణనదికి ఆల్మట్టి, నారాయణపుర, మలప్రభ, హిడకల్‌తోపాటు తుంగ, భద్ర నదులకు అనుబంధంగా తుంగభద్ర, ఇతర ప్రాజెక్టులు ఉన్నాయి.

ఎన్నికల తర్వాత ఢిల్లీకి డీసీఎం

ప్రాజెక్టుల పరిస్థితిపై డ్రిప్ గ్రాంట్‌లు పొందేందుకు సంబంధించి ఈనెల 13న జరుగుతున్న ఉప ఎన్నికల తర్వాత ఢిల్లీ వెళ్లి కేంద్ర జలవనరులశాఖ మంత్రికి నివేదికలు సమర్పించి సాయం కోరదలిచినట్టు డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. డ్రిప్ ద్వారా గ్రాంట్లు పొందడంతోపాటు రాష్ట్రానికి తాగునీటి పథకాలు, నరేగా గ్రాంట్లు తగ్గిన విషయం కూడా కేంద్ర మంత్రితో చర్చించదలిచినట్టు తెలిపారు. అయితే ప్రాజెక్టుల మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి పెట్టడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రమంత్రి సోమణ్ణ హామీ

భద్ర ఎగువ ప్రాజెక్టు జాతీయ పథకంగా మార్చడంలో తొలి అడుగు పడింది. 2023-24 బడ్జెట్‌లో కేంద్రం రూ.5,300 కోట్ల స్పెషల్ గ్రాంటును ప్రకటించింది. అయితే ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం కేంద్ర జలశక్తి సహాయ మంత్రిగా రాష్ట్రానికి చెందిన సోమణ్ణ వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే భద్ర ప్రాజెక్టు గ్రాంట్ల విషయం ప్రస్తావించగా 2-3వేల కోట్ల రూపాయలు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో భద్ర ఎగువ ప్రాజెక్టు నిర్మాణాల విషయమై కొత్త హామీ వచ్చినట్లయ్యింది.


కొట్టుకుపోయిన తుంగభద్ర క్రస్ట్ గేట్

40 ఏళ్లకిందటే మంత్రిగా పని చేశా

- నీతి తప్పి ఉంటే ఎంతో సంపాదించవచ్చు
- 14 ఇంటి స్థలాలకు తప్పు చేస్తానా : సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్లకిందటే మంత్రిని అయ్యాను, సంపాదనే లక్ష్యమైతే ఎంతో సాధించేవాన్ని కానీ నిజాయితీ, నైతికతను నమ్మాను, అటువంటిది 14 ఇంటి స్థలాలకోసం తప్పు చేస్తానా..? అంటూ సీఎం సిద్దరామయ్య ప్రశ్నించారు. మంగళవారం శిగ్గావి నియోజకవర్గ పరిధిలోని చందాపుర బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ 40ఏళ్లుగా రాజకీయాల్లో కాదు మంత్రి పదవితోపాటు ఎన్నో కీలకమైన హోదాలలో కొనసాగాను. ఆరున్నరేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్నా... అటువంటిది 14 ఇంటిస్థలాలకోసం తప్పు చేస్తానా..? ఎవరైనా నమ్ముతారా..? అంటూ ప్రశ్నించారు. తప్పు చేయకున్నా, తప్పుడు ఆరోపణలతో తనపై కుట్ర పన్నారన్నారు. ప్రజలు ఇటువంటివాటికి అవకాశం ఇవ్వరన్నారు. యడియూరప్పను రాజకీయంగా ముగించేందుకు బసవరాజ్ బొమ్మై ప్లాన్ చేశారని, యడియూరప్పతో కలసి ఉంటూనే కోలుకోలేని రాజకీయం చేశారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అబద్ధాల కోరు అని, ఒకప్పుడు కుమారస్వామి వ్యాఖ్యానించారని, రెండోసారి మోదీ ప్రధాని అయితే దేశం వీడుతానని దేవెగౌడ ప్రకటించారని, ప్రస్తుతం ఆయనతోనే వారంతా చెట్టాపట్టాల్ వేసుకున్నారన్నారు. బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర చెక్‌లో లంచం తీసుకున్నారని, నా గురించి మాట్లాడతారన్నారు. విజయేంద్ర ఎలా సంపాదించింది బీజేపీకే చెందిన యత్నాళ్, రమేశ్ జార్కిహొళిలు వివరించారన్నారు.

15సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టా...

శిగ్గావి శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గంగిభావి రిసార్ట్‌లో కురుబ సామాజికవర్గ ముఖ్యులతో ప్రత్యేక సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 15సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టానని ఇకపై సాధ్యమో కాదో తెలియదన్నారు. కాగినెలె స్వామీజీకి ప్రచారానికి రావద్దని కోరానన్నారు. ఒకవేళ స్వామీజీ వస్తే మీరంతా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. తనపై ఎటువంటి ఆరోపణలు లేవని, అయినా అవమానాలు భరిస్తున్నానన్నారు. తనపై కుట్ర చేసినవారిలో బసవరాజ్ బొమ్మై, యడియూరప్ప, దేవె గౌడ కుమారులు, అశోక్ వంటివారంతా కలిశారన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకే తనపై అవినీతి కుట్ర పన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.


శిగ్గావి నియోజకవర్గం చందాపుర ప్రచారసభలో సీఎం


ఫ్రీడంపార్కులో నిరసన తెలుపుతున్న రైతులు

నైస్‌కు డీకే మద్దతుపై రైతుల ఆగ్రహం

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద నైస్(నంది ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ ఎంటర్ ప్రైజెస్) సంస్థకు డీసీఎం డీకే శివకుమార్ మద్దతు ఇవ్వడం సరికాదని నైస్ బాధిత రైతుల పోరాట సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధిత రైతులు నగరంలో మంగళవారం ఫ్రీడం పార్కులో ఆందోళన చేపట్టారు. వీరికి కర్ణాటక ప్రాంత రైతుసంఘం ప్రధాన కార్యదర్శి యశ్వంత్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు గాయత్రి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైస్ కంపెనీకి మద్దతు ఇచ్చేలా డీసీఎం చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీఎంఐసీ ప్రాజెక్టును నైస్ కంపెనీతో భాగస్వామ్యాన్ని రద్దు చేయాలన్నారు. నైస్ కంపెనీకి భూస్వాధీనం, రోడ్డు నిర్మాణంపై సాగిన అవినీతిపై దర్యాప్తు జరిపి శిక్షించాలన్నారు. రైతుల అంగీకారం లేకుండానే సాగిన భూస్వాధీనాన్ని రద్దు చేయాలని కోరారు. పరిహారం పొందని రైతులకు న్యాయం చేయాలన్నారు. నైస్ అక్రమాలపై శాసనసభ కమిటీ, మంత్రివర్గ సబ్ కమిటీల నివేదికలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేఐఏడీబీ, నైస్ కంపెనీలు అక్రమ పొత్తుతో దోపిడీ చేశాయన్నారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నైస్ భూ బాధితుల సంఘం అధ్యక్షుడు వెంకటాచలయ్య, ఉమాశంకర్, వెంకటాచలప్ప పాల్గొన్నారు.

రేపు హుబ్బళ్లికి జేపీసీ చైర్మన్ జగదాంబికా పాల్

- వక్ఫ్ నోటీసులు అందుకున్న రైతులతో ముఖాముఖి



బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు వివాదంపై ఆరా తీయడానికి జాయింట్ పార్లమెంట్ కమిటీ చైర్మన్ రానున్నారు. వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తులుగా హుబ్బళ్లి, విజయపుర, కలబురగితోపాటు పలు జిల్లాల రైతులకు నోటీసులు ఇవ్వడంపై రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు జేపీసీ చైర్మన్ జగదాంబికా పాల్ రాష్ట్రానికి రానున్నారు. వివాదంపై సమగ్రంగా విచారించేందుకు రాష్ట్రాన్ని సందర్శించాలని బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య ఆయన కోరారు. ఈమేరకు ఈనెల 7న గురువారం హుబ్బళ్లి - విజయపురలకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వస్తోంది. ఇదే విషయాన్ని ఎంపీ తేజస్విసూర్య నగరంలో మంగళవారం ప్రకటించారు. రైతులు శతాబ్దపు కాలం పాటు స్వాధీనంలో ఉండే భూములను సాగు చేసుకుంటుండగా ఇటీవల కొన్ని నెలలుగా వక్ఫ్ ఆస్తులుగా నోటీసులు ఇస్తుండడంతో అన్నదాతలు అయోమయంలో పడ్డారు. జిల్లాల వారీగా ఈ పరిస్థితి రోజూ పెరుగుతుండడం వివాదాలకు కారణమవుతోంది. బీదర్‌లోని ప్రతిష్టాత్మకమైన కోటతోపాటు ఉత్తర కర్ణాటక పరిధిలోని పలు మఠాల భూములను వక్ఫ్‌కు చెందినవిగా నోటీసులు ఇచ్చారు. ఈమేరకు సమగ్ర అధ్యయనం కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ రానుంది. అయితే వక్ఫ్‌బోర్డు ఆస్తులుగా రైతులకు జారీ చేసిన నోటీసులను వెంటనే రద్దు చేయాలని సీఎం సిద్దరామయ్య అన్ని జిల్లాల అధికారులకు ఆదేశించారు. ఇదే విషయమై బీజేపీ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ఆందోళన చేసిన విషయం తెలిసిందే. కాగా వక్ఫ్ ఆస్తులుగా నోటీసులు ఇచ్చేలా అధికారులను ఆదేశించిన వక్ఫ్‌శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌పై సొంతపార్టీకి చెందిన ఉత్తర కర్ణాటక ప్రాంత ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

రికార్డు..సృష్టిస్తారు..!



- బళ్లారిలో నకిలీ దస్తావేజుల తయారీ ముఠా ..
- స్వాతంత్ర్యానికి పూర్వం పత్రాలనూ సృష్టిస్తారు..!
- దూర ప్రాంతాల్లో సెటిల్ అయిన వారి స్థలాలే టార్గెట్
- సూత్రధారుల్లో ఇద్దరు రెవెన్యూ అధికారులు.. న్యాయవాది
- కలెక్టర్ విచారణతో వెలుగులోకి

బళ్లారి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కన్నేస్తే ఎలాంటి ఆస్తినైనా కాజేస్తారు.. ఆస్తులైనా.. ఇళ్లైనా.. ఆఖరికి ప్రభుత్వ స్థలాలకైనా వారు రికార్డులు సృష్టిస్తారు. ఇళ్లు అయినా.. స్థలం అయినా ఇలా ఏదైనా సరే ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు తయారీ చేసే ముఠా బళ్లారిలో పాగా వేసింది. ఇటీవల వారి కార్యకలాపాలు బయట పడడంతో నగరంలో ఆస్తులున్న వారు బెంబేలెత్తుతున్నారు. స్వాతంత్రం రాని నాటి కాలం దస్తావేజులైనా సృష్టించడం వారి ప్రత్యేకత. ఈ ముఠాలో ఒకరిద్దరు రెవెన్యూ అధికారులతో పాటు, న్యాయవాద వృత్తిని చదువుకున్న ఒక వ్యక్తి కూడా ఈ ముఠాలో ఉన్నారని డీసీ విచారణలో తేలినట్లు సమాచారం.

నకిలీ దస్తావేజుల తయారీ ముఠా ముందుగా విలువైన పాత ఆస్తులపై కన్నేస్తారు. ముఖ్యంగా ఆస్తుల యజమానులు వేరే ప్రాంతంలో నివసించే వాటినే టార్గెట్ చేశారు. ఆ వ్యక్తి పేరుతో ఉండే ఆస్తిని వారి సంబంధీకుల పేరుతో మార్చుకుంటారు. పాతకాలం నాటి దస్త్రావేజుల్లా ఉండే వాటిని సృష్టిస్తారు. ఉదాహరణకు ఓ వ్యక్తికి బళ్లారిలో విలువైన స్థలం ఉంది.. అతను వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడి ఉంటారు. ఆయన ఆధార్ నెంబర్‌లో ఆయన ఫొటో కాకుండా ఇతర ఫొటోలు అతని పేరుతో నకిలీ దస్తావేజులు సృష్టిస్తారు. దీన్ని కొనేది, అమ్మేది ముఠానే కాబట్టి రిజిస్ట్రార్ ఆఫీస్‌లో దర్జాగా రిజిస్టర్ చేసుకుంటారు. ఆవ్యక్తి ఆధార్ కార్డు కూడా నకిలీది సృష్టించి అనుమానం రాకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిస్తారు.

ఇటీవల కాలంలో ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారి ప్రైవేటు వ్యక్తికి మారుస్తుండగా అధికారులు గుర్తించారు. ఇవే కాక పలు స్థలాలను నకిలీ రికార్డులతో కాజేశారని సమాచారం. ప్రధానంగా డీసీ కార్యాలయంలోని రికార్డులను మార్చడంలోనూ వీరు సిద్ధహస్తులని తెలుస్తోంది. నకిలీ ముఠా గురించి తెలసుకున్న డీసీ ఇటీవల వీరిపై ప్రత్యేక నిఘా వేశారు. ఇటీవల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తికి అప్పగించే విషయంలో వీరి గుట్టు బయట పడింది. 1980లో కంప్యూటరైజ్ పత్రాలు లేవు.అప్పుడు లిఖిత పూర్వకంగా ఉండే దస్త్రావేజులే ఉన్నాయి. కానీ 1980లో నమోదు చేసినట్లుగా కంప్యూటర్ పత్రాలు సృష్టించడంతో డీసీకి పట్టు బడినట్లు తెలుస్తోంది. అనుమానం వచ్చిన కలెక్టర్ మొత్తం ముఠా కూపీ లాగాలని అధికారులను ఆదేశించారు. మొత్తం మీద బళ్లారిలో నకిలీ దస్త్రావేజుల తయారీ ముఠా గుట్టు రట్టవడం కలకలం రేపుతోంది. ఇందులో కీలక నేతల ప్రధాన అనుచరులు కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అధికారులు మరింత నిఘా పెంచి ముఠాను అదుపులోకి తీసుకోకపోతే అమాయకుల ఆస్తులు గల్లంతు అయ్యే ప్రమాదం ఉంది.




రిషి సునక్ దంపతులకు జ్ఞాపిక అందజేత

రాఘవేంద్రస్వామి మఠంలో... బ్రిటన్ మాజీ ప్రధాని సునక్ పూజలు

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జయనగర్‌లోని నంజనగూడు రాఘవేంద్రస్వామి మఠంలో బ్రిటన్ దేశ మాజీ ప్రధాని రిషి సునక్ దంపతులతోపాటు అత్తమామలు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. బెంగళూరులో వ్యక్తిగత పర్యటనకు రిషి సునక్ వచ్చారు. కార్తీకమాసం సందర్భంగా రిషి సునక్, భార్య అక్షతా మూర్తితోపాటు రాఘవేంద్ర మఠంలో దీపాలు వెలిగించారు. ఆ తర్వాత ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి, ఆయన భార్య రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తిలతో కలసి బృందావనంకు పూజలు చేశారు. మఠం మేనేజర్ వాదీంద్రాచార్య, అర్చకుడు వేదమంత్రాలు చదివి ఆశీర్వదించారు.

ఆలయాల దర్శనానికి ప్రత్యేక రైలు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని 12 ఆలయాల సందర్శనకు తమిళనాడు నుంచి ప్రత్యేక ఆధ్యాత్మిక రైలు ఏర్పాటుచేశారు. మదురై నుంచి డిశంబరు 5వ తేది బయల్దేరే రైలు దిండుగల్, తిరుచ్చి, విరుదాచలం, విల్లుపురం, చెన్నై ఎగ్మూర్ మీదుగా కర్ణాటక వెళ్లనుంది. కర్ణాటకలోని నవ బృందావనం, హంపి, గోకర్ణ మహాబలేశ్వరుడు, మూర్డేశ్వరుడు, కొల్లూరు మూకాంబిగై, ఉడిపి శ్రీకృష్ణుడు, ధర్మస్థళ మంజునాథ, మైసూరు, శ్రీరంగపట్నం, మేల్‌కోట నరసింహా సహా 12 ఆలయాలు సందర్శించవచ్చు. తొమ్మిది రోజుల పర్యటనకు 'ఏసీ' థర్డ్ క్లాస్ కోచ్‌లో ఒకరికి రూ.29,400, స్లీపర్ క్లాస్ రూ.22,000 ఛార్జీగా నిర్ణయించారు.

న్యూస్‌బాక్స్

నేడు ప్రత్యేక గ్రామసభలు
కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరవు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ప్రాంతాల్లో బుధవారం ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అనంతపురం రూరల్, నార్పల, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల్లో కరవు నివారణ చర్యల్లో భాగంగా వివిధ పనులకు ఆమోదంతో తీర్మానాలు చేసి పనులు చేపడుతారన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయా మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, ఏపీఓలు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు విషయం తెలియజేయాలన్నారు.

టమోటా కిలో రూ. 30

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 30తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 21, కనిష్ఠ ధర రూ. 13 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ. 34 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 34,250తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 23వేలు, సరాసరి రూ. 26 వేలుతో అమ్ముడుపోయాయని తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 43 టన్నుల చీనీకాయలు వచ్చాయని తెలిపారు.

స్ర్కీనింగ్ టెస్టుకు హాజరుకావాలి

పుట్టపర్తిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు ఈనెల 10వ తేదీ నిర్వహించనున్న స్ర్కీనింగ్ పరీక్షకు హాజరుకావాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ సాధికారత సంచాలకులు శివరంగప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణతోపాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించబడుతుందన్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం
రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక రూడ్ సెట్ సంస్థలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బ్యాగుల తయారీలో ఉచిత శిక్షణ ఉరవకొండ ప్రభుత్వ ఐటీఐలో 13 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్, కంప్యూటర్ ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఈనెల 13వతేదీ నుంచి 30రోజులపాటు ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన 18-45 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఆధార్, రేషన్ కార్డు ఉన్న మహిళలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 9440905479 లను సంప్రదించాలని కోరారు.

నేడు 20వ మహాజనసభ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతి జిల్లా సమాఖ్య 20వ వార్షిక మహాజనసభ బుధవారం స్థానిక పంగల్‌రోడ్డు సమీపంలో ఉన్న టీటీడీసీలో నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు షేక్‌నబీ, రాధమ్మ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గత మహాసభ సమావేశాలపై సమీక్ష, 2023-24 ఆర్థిక సంవత్సరంలో లెక్కలు, ఆడిట్, నివేదికపై చర్చిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక, బడ్జెట్‌పై చర్చ ఉంటుందన్నారు. అనంతరం పాలకవర్గసభ్యుల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

ద్విచక్ర వాహనాలకు నిప్పు

గోరంట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడేశ్వరి కాలనీలో బోదగిరి మల్లికార్జున ఇంటి ముందు ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టారు. మల్లికార్జున చేనేత మగ్గాలు నిర్వహిస్తున్నాడు. ఇంటి ముందు ఏర్పాటు చేసిన కొట్టం కింద ద్విచక్ర వాహనాలు ఉంచాడు. ఆ వాహనాలు పాక్షికంగా కాలిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఎంపిక



జయంత్ కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-19 మల్టీ డే జట్టుకు జిల్లా క్రీడాకారుడు జయంత్ కృష్ణ ఎంపికయ్యాడు. 2024-25 సీజన్‌లో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్న బీసీసీఐ కూచ్ బెహర్ ట్రోఫీకి ఏపీ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు.

నలిపేస్తున్న నల్లి

మిరప పంటలో ఎర్ర, నల్లనల్లి ఉధృతి

మిరప పూతపై పదుల సంఖ్యలో నల్ల నల్లి పురుగులు





మిరప ఆకు కింది భాగంలో సోకిన ఎర్ర నల్లి

- విల్ట్, ఆకుముడతతో అన్నదాత కుదేలు
- పూత, పిందె దశలో ఎండిపోతున్న పంట
- పురుగు మందులు వాడినా నిష్ప్రయోజనం
- పెరిగిన పెట్టుబడితో రైతన్న విలవిల

కాపుదశలో పంటలు దెబ్బ తింటున్నాయి

మూడు ఎకరాల్లో మిరప సాగు చేశా. పురుగులు నివారణకు రకరకాల మందులు వాడినా ఫలితం లేకుండా పోతోంది. వారానికి రెండు సార్లు మందులు వాడాల్సి వస్తోంది. ప్రస్తుతం మిరపకు ఎర్ర నల్లి, నల్ల నల్లి ఆశించడంతో ఎదుగుదల లేకుండా పోయింది. కాయలు ఎర్రబారుతున్న సమయంలో నల్లి దెబ్బకు మచ్చలు ఏర్పడి పంట ఎదుగుదల లేకుండా పోయింది. పంట ఎదుగుదలకు ఎరువులతో పాటు నీళ్ల మందు వాడుతున్నా. అయినా పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదు.

- నాగరాజు, రైతు

విడపనకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మిరప రైతులను తెగుళ్ల కష్టాలు వీడటం లేదు. గత ఏడాది వర్షాలు, గిట్టుబాటు ధర లేక మిరప రైతులు లక్షల్లో నష్టపోయి అప్పుల పాలయ్యారు. ఈ ఏడాదైనా మంచి దిగుబడితో లాభాలు వస్తాయని ఆశించిన రైతన్నకు తెగులు రూపంలో నిరాశే ఎదురవుతోంది. జూలై నెలలో సాగు చేసిన మిరప పంట ప్రస్తుతం మంచి పూత, కాయ దశలో ఉంది. అయితే వర్షాలు అధికం కావటంతో తెగుళ్ల ఉధృతి పెరిగింది. గత ఏడాది లాగే ఈసారి కూడా నల్ల నల్లి పురుగుతో పాటు ఎర్ర నల్లి కూడా ఆశించింది. రెండు రకాల పురుగులు సోకటంతో మిరపకాయలకు మచ్చలు ఏర్పడి ఎర్రకాయలు కూడా నల్లగా మారి కుళ్లి పోతున్నాయి. ఎర్రనల్లితో కిందిభాగంలో ఎర్రగా మారి ఆకులు మొత్తం ఎండి పోతున్నాయి. నల్ల నల్లి పురుగుతో పూత మొత్తం రాలి పోతోంది. నల్లి పురుగు ఆకులను గోకటం వల్ల ఎర్రగా మారి ఎండిపోతాయని రైతులు తెలపుతున్నా రు. రైతులు వాటిని నివారించేందుకు వారాని రెండు సార్లు పురుగు మందులను పిచికారీ చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ఒక్కసారి పురుగు మందు పిచికారీ చేయాలంటే ఎకరాకు రూ.12 వేల నుంచి 15 వేలు ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు.



ఆకు ముడత సోకి ముడతలు పడిన మిరప పంట

విల్ట్, ఆకు ముడత కూడా...

మిరప పంటకు ఎర్రనల్లి, నల్లనల్లికి తోడు విల్ట్, ఆకు ముడత(బింగి) కూడా సోకింది. ఏ తెగులును అదుపు చేయాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. కొన్ని చోట్ల మిరప పంటకు ఆకు ముడత(బింగి), విల్ట్ సోకి పూర్తిగా ఎండి పోయాయి. కొన్ని నల్లి దెబ్బకు కాపు నిలబడకుండా పోయాయి. హెచ్చెల్సీ జీబీసీ, హంద్రీనీవా కాలువ కింద అధికారికంగా వివిధ రకాల మిరప పంటలను 20 వేల ఎకరాల్లో సాగు చేశారు. విడపనకల్లు మండలంలో 10700ఎకరాల్లోను, వజ్రకరూరు మండలంలో 3200 ఎకరాల్లోను, ఉరవకొండ మండలంలో 3600 ఎకరాల్లోను, కూడేరు మండలంలో 1600 ఎకరాల్లోను, బెళుగుప్ప మండలంలో 2500 ఎకరాల్లోను మిరప పంటను సాగు చేశారు. గత ఏడాది 45వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. కానీ నల్లి గెబ్బకు, గిట్టుబాటు ధరలు లేక పోవటంతో ఈ ఏడాది 50శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ. లక్ష నుంచి 1.5లక్ష వరకూ పెట్టు బడులు పెట్టారు. ఎకరాకు కనీసం 5 క్వింటాళ్ల దిగుబడి వస్తే పెట్టుబడి అయిన కొంత తిరిగి వస్తుందని రైతులు చెబుతున్నారు.



విల్ట్‌తో మచ్చలు పడి ఎండిన మిరప కాయలు



నల్లి పురుగు నివారణకు మిరప తోటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసిన రైతు

విల్ట్‌తో వాడు ముఖం: సురేష్, రైతు



మూడు ఎకరాల్లో కడ్డీ రకం మిరప సాగు చేశా. వర్షాలు అధికమై తేమ ఎక్కువ కావటంతో పంటకు విల్ట్ తెగులు సోకింది. రకరకాలు మందులు వాడినా ప్రయోజనం లేదు. పంట మొత్తం ఎండి పోయే పరిస్థితికి వచ్చింది ఇప్పటికే ఎకరాకు రూ. లక్ష వరకూ పెట్టుబడులు పెట్టా. కనీసం పెట్టుబడి కూడా తిరిగి రాకుండా పోతోందని భయంగా ఉంది. ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోవాలి.

జాగ్రత్తలతోనే రక్షణ: నెట్టికల్లు, హార్టికల్చర్ అధికారి



పంట సాగు చేసినప్పటి నుంచే తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎర్రనల్లి, నల్లనల్లి నివారణకు నీమ్ ఆయిల్ 3ఎంఎల్‌లు, అసిపేట్ 1.5గ్రాములు లీటర్ నీటికి కలిపి మిరప మొక్కలపై పిచికారీ చేయాలి. గుడ్డును నివారించ గలిగితే పురుగును నివారించినట్టే. ప్రాపర్‌గేట్ 2ఎంఎల్‌లు లేదా ఒబెరాన్ 1ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి మొక్కలపై పిచికారీచేయాలి. తెల్ల దోమ నివారణకు ప్రతి పొలంలోను పసుపు రంగు అట్టలను ఎకరాకు 40నుంచి50 వరకు ఏర్పాటు చేయాలి. విల్ట్ నివారణకు పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలి. సాలల్లో నీరు నిల్వ లేకుండా బయటకు పంపాలి. మిరపను సాగు చేసే సమయంలో పంట ఎండ బెట్టకు గురి కాకుండా చూడాలి. మిరప పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న, సజ్జ వంటి పంటను మేర సాలల్లో సాగు చేయాలి. 25నుంచి30మైక్రాన్ మల్చింగ్ వేసుకొని డ్రిప్ పద్ధతిలో మొక్కలకు సాగు నీరు పెట్టాలి. దీని ద్వారా పురుగు ఉధృతిని అరికట్ట వచ్చు.

పంట మొత్తం ఎండిపోతోంది: గంగన్న, రైతు



నేను 8 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశా. ఆకుముడత తెగులు, ఎర్రనల్లి తెగులు సోకి పచ్చని పంట పొలం మొత్తం ఎండి పోయే పరిస్థితికి వచ్చింది. ఇప్పటికే ఎకరాకు రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టా. ఎకరాకు ఒక క్వింటా, రెండు క్వింటాళ్లు దిగుబడి రావటం కూడా కష్టంగా మారింది. పెట్టుబడికి ఇప్పటికే రూ. 8లక్షలకు పైగా అయ్యింది. ఎకరాకు మూడు క్వింటాళు కూడా దిగు బడి రావటం కష్టంగానే ఉంది. దాదాపుగా రూ. 8లక్షలు పెట్టుబడి నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

ప్రమాదకరంగా హోర్డింగులు

- గాలికి ఊగుతున్న వైనం
- ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్‌తీగలతో పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్



పిల్లర్ లేకుండా పైపు ఆధారంగా హోర్డింగ్ స్తంభం

రాయదుర్గం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీ ల ప్రచారం కోసం ఏర్పాటు చేసిన హోర్డింగులతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికే రాయదుర్గం పట్టణంలో భారీ ఎత్తున రెండు హోర్డింగులను ఇనుప చువ్వలతో ఏర్పాటు చేశారు. ఆ హోర్డింగులకు కింద పిల్లర్లు లేకుండా వేయడంతో పాటు నాసిరకంగా ఏర్పాటు చేసిన కారణంగా గాలికి అటు ఇటు ఊగుతున్నాయి. సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలలో నిత్యం విద్యుత్ సరఫరా ఉంటుంది. ప్రమాదవశాత్తు హోర్డింగ్ ఏ మాత్రం నేలకు ఒరిగినా నేరుగా తీగలపై పడే అవకాశం ఉంది. పైగా అటు ఇటు ఊగుతుండడంతో ప్రజలు కూడా భయానికి లోనవుతున్నారు. రోడ్డుపై నిత్యం రద్దీగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో హోర్డింగులకు సమీపంలో రాగానే చోదకులు దృష్టి అంతా దానిపైనే ఉంచే పరిస్థితి. ప్ర మాదం పొంచి ఉందనే విషయం అధికారులకు తెలిసినప్పటికీ వాటిని తొలగించడంలో ఏ మాత్రం చొర వ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అటు జూనియర్ కళాశాల క్రీడా మైదానం వద్ద, ఇటు ఎంపీడీ ఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ హో ర్డింగులు ప్రమాదకరంగా ఉన్నాయని ఇప్పటికే స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. తూతూ మంత్రంగా కొంత సి మెంట్ వేసి దానిని కాపాడుకునే ప్రయ త్నం చేశారు. హో ర్డింగులు మాత్రం హోరు గాలి ధాటికి నిలబడే పరిస్థితి ఉండదని, ఎప్పటికైనా ప్రమాదం తప్పదనే గ్రహించి అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రబీ వేరుశనగ సబ్సిడీ ధర ఖరారు

అనంతపురం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రబీ వేరుశనగ సబ్సిడీ ధరలను ఎట్టకేలకు ఖరారు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. క్వింటాల్ వేరుశనగ పూర్తి ధర రూ.9600గా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.3840 పోను రైతు వాటా కింద రూ.5760 చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది రబీ సీజన్‌కు జిల్లాకు 6671 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. ఒక్కో రైతుకు ఐదెకరాల దాకా గరిష్ఠంగా మూ డు బస్తాలు (30కేజీల బస్తాలు) పంపిణీ చేస్తారు. గురువారం నుంచి జిల్లా లోని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగ కావాల్సిన రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు.

టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు - 2025 ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 18వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు. అలాగే రూ. 50 అపరాధ రుసుంతో ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు, రూ. 200 ఫైన్‌తో ఈనెల 26వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు, రూ. 500 ఫైన్‌తో వచ్చే నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు.

క్రిస్మస్ హైటీకి నిధులివ్వండి
- మంత్రికి స్వామిదాస్ వినతి

అనంతపురం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో క్రిస్మస్ హైటీ నిర్వహించేందుకు ప్రభుత్వం తరఫున నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి జిల్లాకు రూ.1.50 లక్షలు మంజూరుచేశారని, ప్రస్తుతం ప్రతి జిల్లాకు రూ.3 లక్షలు మంజూరు చేయాలని కోరారు. చర్చిలకు ప్రాపర్టీ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన మంత్రిని కోరినట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ: ఎమ్మెల్యే గుమ్మనూరు



జైభీం నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

గుంతకల్లు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని 1వ వార్డులో అంబేడ్కర్ భవన్ వద్ద మంగళవారం రాత్రి ఆయన పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా చూసే పార్టీ టీడీపీనేనన్నారు. సభ్యత్వం ఉంటే కార్యకర్త కుటుంబానికి పార్టీ కొండంత ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందితే రూ. 5 లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందని చెప్పారు. అలాగే కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. వీలైనంత ఎక్కువ మంది సభ్యత్వం పొందేలా చూడాలని వార్డు ఇన్చార్జి, కౌన్సిలర్లకు సూచించారు. అనంతరం జై భీం పార్టీ నాయకురాలు బేపార్ గౌసియా, మున్సిపల్ రిటైర్డ్ అధికారి రామాంజనేయులు టీడీపీలోకి చేరగా.. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జయరాం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీడీపీకి కార్యకర్తలే బలం అన్నారు. కార్యకర్తలకు భరోసా కల్పించాలని అధిష్టానం సభ్యత్వ నమోదు చేపట్టిందని తెలిపారు. ప్రతిఒక్కరూ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని కార్యకర్తలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మనూరు నారాయణ, గుమ్మనూరు ఈశ్వర్, పట్టణ, మండల అధ్యక్షులు ఎంకే చౌదరి, బద్రివలి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి కార్తీక పూజలు



ఆత్మకూరు నవంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో కార్తీకమాస ప్రత్యేకపూజలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టు తిప్పి, అనంతరం అలంకరించారు. పాలాభిషేకం, పంచామృత అభిషేకం, బంగారు కవచసేవ, పల్లకి సేవ, ఆకుపూజ, అర్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాముస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

'పీఎం సూర్య ఘర్'ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ పథకాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి అవసరం ఉందని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ అన్నారు. నగరంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు గురించి జిల్లా విద్యుత్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పథకం గురించి వినియోగదారులకు వివరించి రూఫ్‌టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకోవడం వలన కరెంటు బిల్లు ఆదా అవుతుందన్నారు. ఈ పథకం కింద అన్ని జాతీయ బ్యాంకులు 80శాతం రుణాలను ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ఈఈటీ ప్రసాద్, ఈఈలు జేవీ రమేష్, రాజశేఖర్, డీఈఈ రామకృష్ణ పాల్గొన్నారు.

కాచిగూడ-యలహంక ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీలు

గుంతకల్లు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా వెళ్లే కాచిగూడ-యలహంక (17603/04) ఎక్స్‌ప్రెస్ రైలుకు ఈ నెల 7వ తేదీ నుంచి ఐదు అదనపు బోగీలను జతచేసి పంపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ రైలుకు రెండు 2-టైర్ బోగీలు, ఒక 3-టైర్ ఏసీ బోగీ, ఒక స్లీపర్ బోగీ, ఒక జనరల్ బోగీని శాశ్వత ప్రాతిపదికన జత చేయనున్నట్లు పేర్కొన్నారు.

సాగునీటి పథకానికి నిధులు కేటాయించాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి పథకానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.7వేల కోట్లు నిధులు కేటాయించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను పట్టణంలో మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. తుంగభద్ర ఎగువ కాలువల ఆధునికీకరణ చేయాలన్నారు. తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్లను ఏర్పాటు చేయాలన్నారు. జీడిపల్లి నుంచి మొదలు పెట్టిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. పీఏబీఆర్ కుడికాలువకు సాగునీరివ్వాలని, పిల్లకాలువల నిర్మాణం వెంటనే పూర్తి చేయలని, రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి మండలంలోని చెరువులు, కుంటలను నీటితో నింపాలని, రైతులకు సాగు నీరు, గ్రామాల్లో తాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, వైటీసీ రమేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి కోసం, తుంగభద్ర ఎగువ కాలవ ఆధునికీకరణ పనులకు రాష్ట్రబడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే కాలవశ్రీనివాసులు వ్యక్తిగత సహాయకుడికి ఆయన ఈమేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ పనులు, హంద్రీనీవా కాలువ వెడల్పు చేసేందుకు నిధులు కేటాయింపునకు జిల్లాలోని ఎమ్మెల్యేలు బడ్జెట్ సమావేశంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేయాలి

ఉరవకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు ఆంజనేయులు, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

రేషన్ షాపు కోసం ఘర్షణ... నలుగురికి గాయాలు

ముదిగుబ్బ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.బండ్లపల్లిలో చౌకధరల ధాన్యపు డిపో కోసం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడినట్లు ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. బండ్లపల్లి గ్రామంలో రేషన్‌షాపు మాకు కావాలని ఒక వర్గం, కాదు మాకే కావాలని మరో వర్గం సోమవారం రాత్రి ఘర్షణకు దిగారు. ఈ రెండు వర్గాల మధ్య పాతగొడవలు ఉన్న నేపథ్యంలోనే రేషన్ షాపు కోసం ఘర్షణ జరిగినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో రమేశ్, అక్కులప్ప, లింగమయ్య, ఆదినారాయణ గాయపడ్డారన్నారు. ఇందులో లింగమయ్య, ఆదినారాయణలను కదిరి ప్రభుత్వాస్పత్రికి, రమేశ్, అక్కులప్పలను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 17 మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

బధిర మహిళపై అత్యాచార యత్నం

సోమందేపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బధిర, ఒంటరి మహిళపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పెడబల్లి రామాంజనేయులు సోమవారం అర్ధరాత్రి అత్యాచారానికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన బధిరురాలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి రామాంజనేయులు తలుపు తట్టాడు. ఆమె ఎవరని తలుపు తీయగా చేయి పట్టుకుని లాగి అత్యాచారానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించి, అతడి బారి నుంచి తప్పించుకుని గ్రామంవైపు పరుగులు తీసింది. దీంతో అతను పరారయ్యాడు. బాధితురాలు ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలియజేసి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ రాఘవన్ తెలిపారు. కాగా బాధితురాలికి ఎనిమిదేళ్ల కిందట కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తితో వివాహం అయ్యింది.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

అనంతపురంరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్ విభాగం ఈఈ శ్రీహరి ఆధ్వర్యంలో రాప్తాడు, ధర్మవరం, ముదిగుబ్బ మండలాల్లో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో గృహ కనెక్షన్ తీసుకుని వ్యాపార సముదాయాలకు వాడుతున్నవారిని గుర్తించి 8 కేసులు, తీసుకున్న లోడు కన్నా అదనంగా వినియోగిస్తున్న వారిపై 17 కేసులు, మీటర్ ఉండి డైరెక్ట్‌గా కరెంటు వాడుతున్న వారిపై 15కేసులు నమోదు చేశారు. రూ.3.5లక్షల జరిమానా విధించారు.

చెస్ పోటీల్లో నలుగురికి పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో నగరానికి చెందిన నలుగురు క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇటీవల ఏలూరులో ఏపీ మొదట చెస్ ర్యాంకింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్-10 ఓపెన్ కేటగిరిలో కాగిత సాయి యశస్ ఐదు రౌండ్లలోనూ తిరుగులేని ఆధిక్యతను చాటి విజేతగా నిలిచాడు. వాసు సాయి మనోజ్‌కృష్ణ ఐదు రౌండ్లకు గాను నాలుగు రౌండ్ల ఆధిక్యతతో తృతీయ స్థానంలో నిలిచాడు. అవుతి సుకృత ఐదు రౌండ్లలో మూడు రౌండ్లలో గెలిచి నాలుగో స్థానంలో నిలిచింది. పల్లమనేని మనస్వి మల్కా నాలుగో స్థానంలో నిలిచింది. కోచ్ గుత్తి రవితో పాటు విజేతలను చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవిరాజు అభినందించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

టీఆర్ మహాలింగం (జయంతి)



'మాలి'గా పేరొందిన వేణుగాన కళాకారుడు తిరువిడై మరుదూర్ రామస్వామి మహాలింగం తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లాలో 1926 నవంబరు 6న జన్మించారు. కర్ణాటక సంగీతంలో వేణుగానానికి సంబంధించి సరికొత్త ప్రక్రియలను పరిచయం చేశారు. ఈయన శైలిలో గమకాలు గాత్ర సంగీతానికి అనుకూలంగా వేణువు పలికించడానికి వీలైంది. ఏడేళ్ళ ప్రాయంలోనే ఆయన సంగీత కచేరిలో పాల్గొన్నారు. ప్రత్యేకించి వెదురుతో చేసిన వేణువులపై అద్భుతమైన సంగీతాన్ని పలికించారు. 'పద్మభూషణ్' పురస్కారం ప్రకటించినా సున్నితంగా తిరస్కరించారు. 1986 మే 31న కన్నుమూశారు.

యశ్వంత్ సిన్హా (పుట్టినరోజు)



దేశ రాజకీయ నాయకులలో ఒకరైన యశ్వంత్ సిన్హా 1937 నవంబరు 6న బీహార్ రాష్ట్రం పాట్నాలో జన్మించారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రిగా పలు సంస్కరణలు తెచ్చారు. 1960లో ఐఏఎస్‌కు ఎంపికై 24 సంవత్సరాల పాటు పలు కీలక పదవులు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేతల్లో ఒకరైన ఆయన 2018 వరకు ఆ పార్టీలో కొనసాగారు. యూనివర్సిటీ ఆఫ్ పాట్నాలో కొంతకాలం ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. రెన్యూ పవర్ సంస్థాపక చైర్మన్‌గా వ్యవహరించి సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలో అపారమైన కృషి చేశారు. ఇటీవల ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్‌లో చేరినప్పటికీ రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీని వీడారు.

పాపినేని శివశంకర్ (పుట్టినరోజు)



కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ 1953 నవంబరు 6న గుంటూరులో జన్మించారు. తెలుగు సాహిత్యంలో కవి, కథకులు, విమర్శకులు, చిన్నకథల రచయిత. సాహితీ త్రిముఖుడిగా పేరొందారు. వందలాది కవితలు, చిన్నకథలు, వ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. తెలుగు అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి 2010లో రిటైరయ్యారు. అదేపల్లి రామ మోహన్‌రావ్ విమర్శ పురస్కారం, హనుమారెడ్డి పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు.

9నుంచి పీసీ సర్కార్ మ్యాజిక్ షో

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే పేరొందిన మెజీషియన్ పీసీ సర్కార్ మ్యాజిక్ షో ఈనెల 9నుంచి జరుగుతోంది. ఐదేళ్ల తర్వాత నగరంలో సర్కార్ షోకు ఏర్పాట్లు చేస్తున్నారు. 9, 10, 16, 17, 18 తేదీలలో ప్రదర్శనలు ఉంటాయి. టౌన్‌హాల్‌లో ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. పీసీ సర్కార్ అంతర్జాతీయ స్థాయిలో రాణించినవారు. మ్యాజిక్ పరంపరను వారి కుటుంబం కొనసాగిస్తోంది.

సాగులో ఆధునికత పాటించాలి

▶▶ ఇస్రో శాస్త్రవేత్త రామనగౌడ

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు దేశంలో శతాబ్దాలకాలంగా సాగుతోందని, యువరైతులు ఆధునికతవైపు వెళ్లాలని ఇస్రో శాస్త్రవేత్త రామనగౌడ వి నాడగౌడ అభిప్రాయ పడ్డారు. వ్యవసాయం, పర్యావరణ, సాంకేతికత డేటా నియంత్రించే అగ్రిస్టార్టప్ నింజాకార్ట్ ఆధ్వ ర్యంలో ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసింది. నగరంలోని చిన్న వ్యాపారులు, యువ రైతులకు వృత్తిపరమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ సంద ర్భంగా రామనగౌడ మాట్లాడుతూ పంటల సాగు తోనే లాభాలు సాధ్యం కాదని, మార్కెటింగ్ గురించి తెలుసుకోవాలన్నారు. శివమొగ్గ స్మార్ట్‌సిటీ లిమిటెడ్ మాజీ ఎండీ చిదానంద ఎస్ వటారె మాట్లాడుతూ వృత్తి జీవనంలో లక్ష్యాలు సాధించాలంటే సవాళ్లను జయించాలన్నారు. విశాలమైన దృష్టికోణంతోపాటు ఏ విధమైన పంటలసాగు చేస్తున్నారు. వాటిని ఎలా రక్షించాలి, మార్కెట్‌లోకి ఎప్పుడు తీసుకెళ్లాలనేది తెలుసుకోవాలన్నారు. బెళగావి జిల్లా ఐగళి గ్రామం లో రైతు కుటుంబంలో జన్మించినా సమాజంలో ఏదైనా సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నానన్నారు. నింజాకార్ట్ కో-ఫౌండర్ వాసుదేవన్ చిన్నతంబి మాట్లాడుతూ సాగు ద్వారా రైతు కుటుంబాలలో సంతోషం, నమ్మకం కలిగి ఉండేలా నింజాకార్ట్ వ్యవ హరిస్తోందన్నారు. యువతకు జ్ఞానం, స్ఫూర్తితో పాటు మెళకువలు నేర్పిస్తున్నామన్నారు.

పేరుకుపోయిన చెత్త దిబ్బలు

● గాంధీ పురస్కార ఎంపిక గ్రామంపై అధికారుల నిర్లక్ష్యం ● వీధుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు...

బాగేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గూళూరు హోబళి కేంద్రం గ్రామపంచాయతీ నెలక్రితం 2023-24కు గాంధీ గ్రామ పురస్కారానికి ఎంపికైంది. అయితే గ్రామంలో పలు చోట్ల చెత్తదిబ్బలు పేరుకుపోవడం విమర్శలకు కారణమవుతోంది. ప్లాస్టిక్ సహా ఇతర చెత్తాచెదారం వ్యర్థాలను సమగ్రంగా విభజించకనే పడేశారు. గ్రామానికి ఇరువైపులా రెండు చెరువులు ఉన్నాయి. చెరువులకు నేరుగా డ్రైనేజీనీరు వదలడంతోపాటు చెత్తను పడేస్తారు. చెత్త తొలగింపులో సరైన నిర్వహణ లేకుండా నామమాత్రంగా స్వచ్ఛభారత అభియాన సాగుతోంది. గ్రామంలో నిత్యం సేకరిస్తున్న వ్యర్థాలు పాలడెయిరీ సమీపాన దిబ్బగా పడేస్తున్నారు. దీన్ని వారానికోసారి లేదా నెలకోసారి నిప్పుపెట్టా కాలుస్తున్నారు. తద్వారా వెలువడుతున్న పొగ తీవ్రంగా ఇబ్బంది కలిగిస్తోందని స్థానికులు వాపోతున్నారు. సేకరించిన చెత్తను సమగ్రంగా తడి, పొడిగా విభజించి సంస్కరించాలనే మార్గదర్శకాలు ఉన్నాయి. అయితే ఆమేరకు అమలు కావడం లేదని తెలుస్తోంది. చెత్త సంస్కరణలో శాస్త్రీయత పాటించకపోవడంతో దుర్గంధం, ఇతరత్రా సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక సేకరించిన వ్యర్థాలలో ప్లాస్టిక్ వస్తువులు ఎక్కువగా ఉంటున్నాయి.

చెరువులకు నేరుగా మురుగునీరు

గూళూరు సమీపంలోని రెండు చెరువులకు మాంసం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్, హోటళ్ల మురుగునీరు, వ్యర్థాలు నేరుగా పడేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ క్లినిక్‌ల మెడికల్ వేస్ట్ సైతం పడేస్తున్నారు. తద్వారా జలమూలాలు దెబ్బతింటున్నాయి. చెరువుకట్టలపై ఇష్టం వచ్చినట్టు భారీ ప్రమాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం పడేస్తుండగా వీధికుక్కలు, ఆవులు ఇతరత్రా వాటిని తింటూ అవి అనారోగ్యానికి గురవుతున్నాయి. గాంధీ గ్రామ పురస్కారానికి ఎంపికైన గ్రామంలోనే స్వచ్ఛత ఇలా ఉంటే పరిస్థితి ఇతర గ్రామాల్లో ఎలా ఉంటుందోనని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. నిషేధించిన సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నా కనీసం పరిశీలన లేదనే విమర్శలు ఉన్నాయి.

స్థానికుల అభిప్రాయాలిలా...

కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ తాలూకా అధ్యక్షుడు సి తిప్పణ్ణ మాట్లాడుతూ స్వచ్ఛత కొరవడిన కారణంగా దోమలతో రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందిం చాలని కోరారు. సీపీఎం సీనియర్ నాయకుడు చన్నరాయప్ప మాట్లాడుతూ ఏడాది క్రితం జిల్లాను ప్లాస్టిక్ రహితగా మారిందంటూ ప్రకటించి పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. అయితే అమలులో మాత్రం అమలు కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రకటించిన మేరకు తాలూకా, జిల్లా యంత్రాంగం కృషి చేయాలని అభిప్రాయపడ్డారు.



దిబ్బూరులో చెత్తదిబ్బలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా..



చెరువు సమీపంలో పేరుకున్న చెత్తాచెదారం

మానసిక ఆరోగ్యంతోనే ఉత్తమ వ్యక్తిత్వం : టీఎల్ ఆనంద్

చింతామణి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాధువులు, మహనీయులను దర్శించుకోవడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని ఉత్తమస్థితిలో ఉంచుకోవడంతో పాటు ఉత్తమ వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాలని ప్రముఖ ప్రవచనకారుడు తళగవార టీఎల్ ఆనంద్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కైవార క్షేత్రానికి ముద్దేనహళ్ళిలోని మధుసూధన్ సాయి మెడికల్ సైన్స్ రీసెర్చ్ సెంటర్ నుంచి ఎడ్యుకేషన్ టూర్‌కోసం విచ్చేసిన మెడికల్, నర్సింగ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కైవార తాతయ్య బోధనలు జీవితానికి పాఠంలా ఉంటాయన్నారు. జీవనంలోని చేదు సత్యాతలను తమ కీర్తనలు, శతకాల ద్వారా సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఆవిష్కరించారన్నారు. వాటిని మన జీవితాల్లోకి అన్వయించుకోవడం ద్వారా బతుకును సార్థకత చేసుకోవాలన్నారు. సాధువులు లోక కల్యాణం కోసం జీవిస్తారన్నారు. ఉదాహరణకు ఒక చెట్టు తన పండ్లను తనకోసం ఎలా ఉంచుకోకుండా పంచుతుందో అలాగే సాధుపుంగవులు లోకకల్యాణం కోసం తాము గమనించిన వాస్తవాలను, సత్యాలను బోధిస్తూ ప్రజలను చైతన్యం చేస్తారన్నారు. కాగా ఇటీవలి కాలంలో విద్యార్థులలో ఒత్తిడి పెరిగిందని అది ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. కొంత మంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు సైతం పాల్పడిన సందర్భాలు ఉన్నాయని అటువంటి స్థితికి చేరుకోకుండా, సమస్య ఏదైనా మానసిక ధైర్యం పెంపొం దించుకుని అధిగమించాలని హితవు పలికారు. విద్యతోపాటు సేవా మనోభావం అలవరచుకోవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం మరింత ఇనుమడిస్తుం దన్నారు. సకారాత్మక భావాలను అలవాటు చేసుకోవాల న్నారు. మధు సూధన్ సాయి మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సంస్థ విద్యార్థుల సంక్షేమ విభాగం డైరెక్టర్ బిఎస్ మంజ్రేకర్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాలను పర్యటించడం ద్వారా మనలోని జ్ఞానార్జన వృద్ధి అవుతుందన్నారు. సామాజిక, మానవతా విలువలను పెంచుకోవడానికి దోహదం కానుందన్నారు. పరోపకార గుణం పెంచుకోవాలన్నారు. సంక్షేమవిభాగం కన్వీనర్ దేవేంద్రదాస్, సాయి యశస్, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రవచనకారుడు టీఎల్ ఆనంద్

రైతులకు అండగా ఉంటాం : బీజేపీ

శిడ్లఘట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు నుంచి నోటీసులు ఎదుర్కొంటున్న రైతులకు అండగా ఉంటామని బీజేపీ రూరల్ అధ్యక్షుడు సీకల్ ఆనంద్‌గౌడ తెలిపారు. పట్టణంలోని మయూరు సర్కిల్‌లోని బీజేపీ సేవాసౌధలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తుగ్లక్ పాలన తరహాలో కొనసాగుతోందని ఆక్రోశం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న రైతులకు అకస్మాత్తుగా వక్ఫ్ ఆస్తులంటూ నోటీసులు జారీ చేసి సమస్యలు కలిగిస్తున్నారంటూ మండిపడ్డారు. మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ సూచనతోనే అధికారులు వ్యవహరించారన్నారు. శిడ్లఘట్ట శాసనసభ నియోజకవర్గంలో ప్రత్యేకంగా రైతులకోసం ప్రత్యేక కాల్‌సెంటర్ ప్రారంభించామన్నారు. రైతుల భూములకు సంబంధించిన పహణిలలో వక్ఫ్‌బోర్డు నమోదై ఉంటే తమ దృష్టికి తెస్తే న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ విభాగం అధ్యక్షుడు నరేశ్, దిబ్బూరహళ్ళి ప్రసన్నకుమార్, తలదుమ్మనహళ్ళి మధు, వై హుణసేనహళ్ళి దేవరాజ్, సంజీవయ్య, అభినందన్‌రెడ్డి, మోనిశ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో సీకల్ ఆనంద్‌గౌడ తదితరులు

ఉద్యోగి ఆత్మహత్య

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెళగావి తహసీల్దారు కార్యాలయంలోనే ద్వితీయ శ్రేణి ఉద్యోగి (ఎస్‌డిఏ) రుద్రణ్ణ యడవణ్ణవర్ (35) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తహసీల్దారు చాంబరులోనే ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని మంగళవారం తోటి ఉద్యోగులు గుర్తించారు. సోమవారం రుద్రణ్ణను బెళగావి నుంచి సవదత్తి తహసీల్దారు కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ వెంటనే ఆత్మహత్యకు పాల్పడ్డం పలు అనుమానాలకు తావిస్తోంది. విషయం తెలియగానే రుద్రణ్ణ భార్య కుటుంబీకులు తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని రోదించారు. ఖడేబజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. డీసీపీ రోహణ జగదీశ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీస్తున్నట్టు తెలిపారు. తహసీల్దారు చాంబరులో సీసీటీవీలు లేవని, బయట ఉన్న వాటి ఫుటేజీల ద్వారానే పరిశీలిస్తున్నామన్నారు.



రుద్రణ్ణ (ఫైల్)

ఆలయంలోకి దళితుల ప్రవేశానికి నిరాకరణ

▶▶ తహసీల్దారు, డీఎస్పీ పరిశీలన



మల్లతహళ్ళిలో వివరాలు ఆరా తీస్తున్న తహసీల్దార్ విభా విద్యా రాథోడ్

దొడ్డబళ్ళాపుర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆధునికత ఎంతగా అభివృద్ధి చెందినా అస్పృశ్యత అనేది ఇంకా కొనసాగుతూనే ఉందనేందుకు పలు ఉదంతాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఆలయంలోకి దళితులు ప్రవేశించరాదనే నిబంధన విధించిన విషయాన్ని తెలుసుకున్న తహసీల్దారు విభా విద్యారాథోడ్, డీఎస్పీ రవిలు సోమవారం స్వయంగా గ్రామాన్ని సందర్శించి అక్కడి స్థితిగతులపై ఆరా తీశారు. వివరాలిలా. తాలూకాలోని మల్లతహళ్ళి గ్రామంలో చన్నకేశవ, మద్దూరమ్మ, గంగమ్మ, మారమ్మ దేవస్థానాలు ఉన్నాయి. చన్నకేశవ, మద్దూరమ్మ ఆలయాలు అగ్రవర్ణాల పర్యవేక్షణలో ఉండగా గంగమ్మ ఆలయాన్ని దళితులు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయాలు 40ఏళ్లక్రితం నాటివి కావడంతో ఇటీవల జీర్ణోద్ధరణ చేశారు. 15 రోజుల క్రితం గ్రామంలో సభ నిర్వహించి గంగమ్మ, మద్దూరమ్మ, చన్నకేశవ ఆలయాలలో దీపావళి పండుగకు దీపాలు వెలించే విషయమై చర్చలు జరిపారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక దళిత మహిళలు హారతులతో గంగమ్మ దేవికి పూజలు చేసి చన్నకేశవ, మద్దూరమ్మ ఆలయాలకు వెళ్లారు. అయితే అగ్రవర్ణాల వారు అడ్డుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. దళిత మహిళలను ఆలయం లోపలికి రాకుండా బయటే వెలిగించాలని సూచించారు. ఈ సందర్భంగా వాగ్వాదం జరగడంతో లోపలికి రాకుండా ప్రహరీ తలుపులకు బీగాలు వేశారు. ఆలయంలో ప్రవేశానికి సంబంధించి అగ్రవర్ణాల వారితో మాట్లాడేందుకు వెళ్లిన దళిత యువకుడు ప్రశాంత్‌ను తోసేశారు. దీంతో వారి తీరుపై దొడ్డబళ్ళాపుర రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు యత్నించారు. ఇది సున్నిత అంశమని జిల్లా అధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు. అస్పృశ్యత, కులఘర్షణ అంశం నేపథ్యంలో తహసీల్దారు జోక్యం చేసుకుని దళితుల సమస్యలను ఆలకించారు. ఈనెల 11న సోమవారం ప్రత్యేకంగా శాంతిసభ నిర్వహించాలని తీర్మానించారు.

భక్తి శ్రద్ధలతో ఆకాశ దీపోత్సవం



దీపాన్ని వెలిగిస్తున్న భక్తులు

బొమ్మనహళ్ళి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అరికెరె శాంతిని కేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతిధామలోని మంజునాథస్వామి ఆలయంలో ఆకాశదీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ మాట్లాడుతూ పితృదేవతల ఆశీర్వాదం కోసం ఆకాశదీపాన్ని సూర్యాస్తమయం తర్వాత పురుషులు వెలిగించే సంప్రదాయం ఉందన్నారు. దీపాన్ని ఆకాశం వైపు చూపడం ద్వారా పితృదేవతలకు ఉత్తమగతులు సాధ్యమని అభిప్రాయపడ్డారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్తీక సోమవారం రోజున దీపారాధన చేశారన్నారు. ఆలయ ట్రస్టు సభ్యులు తాతయ్యగుప్త, క్రిష్ణయ్యశెట్టి, టివిజి గుప్త, సత్యనారాయణ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడికి సన్మానం



నరేశ్‌కుమార్‌కు సన్మానం

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యుడిగా కర్ణాటక నుంచి ఎంపికైన నరేశ్ కుమార్‌ను సన్మానించారు. మంగళవారం జయనగర్‌లోని ఆయన నివాసంలో మడివాళ సోమేశ్వర ఆలయం చైర్మన్ మునిరాజు, ఎంఆర్‌వై రమేశ్, వెంకటేశ్‌గౌడ, శంకర్, మురళి, బాబు రాజేం ద్రకుమార్ తదితరులు సన్మానం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులకు మెరుగైన సేవలందించేలా కృషి చేయాలని కోరారు.

వారం రోజుల్లో పెళ్లి...

కానిస్టేబుల్ దారుణహత్య



హరీశ్ (ఫైల్)

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో పెళ్లి ముహూర్తం ఉండగా పత్రికలు ఇచ్చేందుకు వెళ్లి వెనుతిరిగి వస్తుండగా కానిస్టేబుల్‌ను దారుణంగా హత్య చేసిన సంఘటన హాసన్ జిల్లాలో చోటు చేసుకుంది. హత్యకు గురైన కానిస్టేబుల్ బాగేశపురం నివాసి హరీశ్ (32)గా గుర్తించారు. సోమవారం బంధువులకు పెళ్లి పత్రికలకు ఇచ్చి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అడ్డగించిన దుండగులు మారణాయుధాలతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హరీశ్ కర్ణాటక ఇండస్ట్రియల్ సెక్యూరిటీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా కొనసాగుతున్నారు. సంఘటనా స్థలాన్ని హాసన్ ఎస్పీ మహ్మద్ సుజితా సందర్శించారు. హరీశ్ వివాహం ఈనెల 11న జరగాల్సి ఉండేది. హరీశ్ ఆకస్మిక మృతితో ఇరు కుటుంబాలలో విషాదం నెలకొంది.

భార్యను హతమార్చి...

లొంగిపోయిన భర్త

శిడ్లఘట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తిమ్మనాయకనహళ్ళి గ్రామ పంచాయతీలోని తూకలహళ్ళిలో కట్టుకున్న భార్యను భర్త హతమార్చి లొంగిపోయిన ఉదంతం చోటు చేసుకుంది. నంజుండప్ప (60), భార్య శాంతమ్మ (55)లకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త నంజుండప్ప తాగుడుకు బానిస కావడంతో తరచూ గొడవలు జరిగేవి. సోమవారం రాత్రి కూడా మద్యం మత్తులో ఉన్న నంజుండప్ప భార్యతో గొడవపడ్డాడు. ఆవేశంలో అందుబాటులో ఉన్న చాకుతో భార్యను పొడి చేయడంతో తీవ్రరక్తస్రావంతో ఆమె మృతి చెందింది. అనంతరం నంజుండప్ప స్థానిక దిబ్బూరహళ్ళి పోలీస్ స్టేషన్‌లో లొంగి పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హంద్రీనీవాతో నీటి సమస్యకు చెక్

కదిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా నీటితో నియోజకవర్గ ప్రజల నీటి కష్టాలు తీరుతాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ముదిగుబ్బ మండలంలోని నాగారెడ్డిపల్లి వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి మెయిన్ కెనాల్ నీటిని విడుదల చేశారు. తలుపుల, ఎన్పీకుంట మండలాల నీటి కష్టాలు హంద్రీనీవానీటితో తీరిపోతాయన్నారు. భూగర్భజలాలు సైతం పెరుగుతాయన్నారు. హంద్రీనీవా ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సాగునీటిని అందిస్తామని పేర్కొన్నారు. అన్ని గ్రామాలతోపాటు పట్టణవాసులకు తాగునీటి కొరత లేకుండా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

అన్ని ప్రాంతాలకు సాగు నీరు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

ధర్మవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించాలన్నదే లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ధర్మవరం చెరువు మరువ పారుతున్న నేపథ్యంలో ఆయన రావులచెరువు గ్రామానికి మంగళవారం నీటిని విడుదల చేశారు. ఏడో మరువ వద్ద పూజ చేసి తూములు ఎత్తి నీటిని విడుదలచేశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ప్రస్తుతం రావులచెరువుకు నీటిని విడుదల చేశామని, దీంతో ఈ మార్గంలో ఉన్న మల్లాకాల్వ, సి.బత్తలపల్లి ప్రాంతాల్లో కూడా భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ధర్మవరం చెరువు నుంచి వీలైనన్ని ఎక్కువ ప్రాంతాలకు సాగునీరు అందించే విధంగా అధికారులతో చర్చిస్తున్నామన్నారు. జిల్లాని హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్నదే సీఎం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, విజయసారథిచౌదరి, మేకల రామాంజి, చిన్నూరూ విజయ్‌చౌదరి, అమరాసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



గంగపూజ చేసి నీటిని విడుదల చేస్తున్న శ్రీరామ్

పారదర్శకంగా ఎన్నికలు: కలెక్టర్

పుట్టపర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా జలవనలరుల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణపై మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు చెరువుల కింద 230 స్థానాలకు, మూడు ప్రాజెక్టులకు ఈనెల 23న ఎన్నికలు నిర్వహించేందుకు రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు సిద్ధం కావాలన్నారు. ఓటరు జాబితా తయారీ తప్పు లు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో విజయసారథి, ఈఈ రాధాకృష్ణ, డీఈ గంగాధర్, ఆర్‌డీఓలు సువర్ణ, ఆనంద్‌కుమార్, మహేశ్, శర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ కేసులతోపాటు వివాదాలు, భూకబ్జాలపై బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను రెవెన్యూ, పోలీసులు సకాలంలో పరిష్కరించాలన్నారు. పీఓఏ చట్టం అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో 2019 నుంచి 2024 వరకు 105 కేసులు ఉన్నాయని, ఇందులో పరిహారం కోసం రూ.4.8కోట్లు ఉండగా ఇప్పటివరకు రూ.75లక్షలు కేటాయించినట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు వీరనారాయణ, శ్రీనివాసులు, రామాంజినప్ప, ఉమాశంకర్, శ్రీనివాసనాయక్, గంగులయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,605.65
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,536	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,116	9,052
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	29.76



కోట మల్లేశ్వర దేవాలయం

నేటి నుంచి హోమాలు

బళ్లారి సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హిందూ ధార్మిక సంస్థలు, ధర్మాదాయశాఖ తరఫున నగరంలో వెలసిన కోటి మల్లేశ్వరాలయంలో కలశ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి శుక్రవారం వరకు హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ గంగాధరప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

సీఎన్‌జీ గ్యాస్ లీక్

● డ్రైవర్ జాగ్రత్తతో తప్పిన ప్రమాదం



గ్యాస్ వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సీఎన్‌జీ గ్యాస్ లీక్ కావడంతో స్థానికులు బెంబేలెత్తారు. జిల్లాలోని హూవినహడగలి పట్టణ పరిధిలోని మాదల గట్టి రోడ్డులోని బసవరెడెమ్మ చెరువు సమీపంలో ట్రాన్స్ ఫోర్ట్ లారీలోని సీఎన్‌జీ గ్యాస్ సోమవారం రాత్రి లీక్ అయ్యింది. లారీ డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రమాదం తప్పింది. తిప్పాపూర్ రోడ్డులోని సీఎన్‌జీ గ్యాస్ ప్లాంట్ నుంచి 60 సిలిండర్లతో లారీ గదగ్ జిల్లా నరగుందకు వెళ్తోంది. పట్టణ శివారులోని బసవరెడ్డెమ్మ చెరువు సమీపంలో వెళ్తుండగా వెనుక నుంచి గ్యాస్ లీక్ అయిన శబ్దం వినిపించింది. అప్రమత్తమైన డ్రైవర్ లారీని రోడ్డు పక్కకు ఆపి పరిశీలించారు. తనిఖీ చేయగా సిలిండర్లకు అనుసంధానం చేసిన పైపు తెగిపోయి గ్యాస్‌లీక్ అవుతోంది. డ్రైవర్ అటుగా వస్తున్న వాహనాలకు సమాచారం అందించి అక్కడి నుంచి వారిని దూరం పంపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి పరిశీలించగా 60 గ్యాస్ సిలిండర్లు లీక్ అయి ఖాళీ అయినట్లుగా తెలుసుకున్నారు. అనంతరం వాహనాన్ని మరమ్మతు నిమిత్తం పట్టణంలోని సీఎన్‌జీ గ్యాస్ ప్లాంట్‌కు తరలించారు.

ఘన సన్మానం

సిరుగుప్ప, అక్టోబరు 5 : పాతికేళ్ల పాటు పత్రికా ఏజెంట్‌గా హుస్సేన్ సాబ్ ఉత్తమ సేవలు అందించారని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లింగరాజురెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో నూతనంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ఎన్నికైన డైరెక్టర్లకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్జీవో అధ్యక్షుడు లింగరాజురెడ్డి మాట్లాడుతూ నవంబరు 16వ తేదీ అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు సర్టిఫికెట్‌ను తీసుకుని ఎన్నికల బరిలో ఉన్న వారికి ఓటు వేయాలని ఆయన సూచించారు. వివిధ రంగాల్లో పత్రికా ఏజెంట్‌గా సేవలందించిన హుస్సేన్‌సాబ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పదాధికారులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సండూరు భవిష్యత్తు బంగారం

● బీజేపీ నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదు ● ఉప ఎన్నికల ప్రచారంలో డీసీఎం డీకే శివకుమార్

బళ్లారి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సండూరు ప్రాంతానికి కాంగ్రెస్ 371(జే) ఇచ్చి ప్రజల బతుకులను బంగారు భవిష్యత్తుగా మార్చిందని డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. మంగళవారం ఆయన తాలూకాలోని తిమ్మలాపురం, ఏళు బెంచి, తోరణగల్లు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయనతో పాటు అభ్యర్థి ఈ అన్నపూర్ణ, ఎంపీ తుకారాం, మంత్రి సంతోష్ లాడ్, మాజీ మంత్రి నాగేంద్ర, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహమ్మద్ రఫీక్, అల్లం వీరభద్రప్ప, వెంకటేశ్ హేగ్డే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా33 మాట్లాడిన ఆయన 371(జే) అమలుకు అప్పట్లో బీజేపీ ససేమీరా అన్నా కాంగ్రెస్ నాయకులు పార్లమెంటులో పట్టుపట్టి జీటను సాధించారన్నారు. బీజేపీ నాయకులకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కాంగ్రెస్‌తో ఇంటింటికీ మేలు జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు జరుగుతున్న మూడు స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. సండూరులో తుకారాం చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన కొనియాడారు. మరోసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్

జగన్ పాలనలో ప్రాజెక్టులు నిర్వీర్యం

● సీఎం చంద్రబాబునాయుడుకు రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
● సీపీఐ ఏపీ కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీష్

బళ్లారి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నీటి ప్రాజెక్టుల అభివృద్ధికి నయాపైసా నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేశారని, ఫలితంగా రైతులు కష్టాలు పడ్డారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బళ్లారిలో ఆయన బళ్లారి జిల్లా కార్యదర్శి ఆదిమూర్తి ఇతర నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ జగన్ నిర్లక్ష్యంతోనే తుంగభద్ర ఆయకట్టు రైతులు కష్టాలు పడ్డారన్నారు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల ఉమ్మడి నీటి ప్రాజెక్టు అయిన తుంగభద్రకు జగన్ ఐదేళ్ల కాలంలో ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. మరమ్మతులను పట్టించుకోకపోవడంతోనే క్రస్ట్ గేటు కొట్టుకుపోయిందన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి ఆంధ్ర సరిహద్దు వద్ద ఎగువ, దిగువ కాలువలు అధ్వానంగా ఉన్నాయని, డ్యాం నుంచి 4,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నా కనీసం 1500 క్యూసెక్కుల నీరు పారేందుకు కూడా వీలు లేకుండా పోయిందన్నారు. అయితే సీఎం చంద్రబాబు నాయుడుకు నీటి ప్రాజెక్టులపై ఆసక్తి అధికమని, నిధులు విడుదల చేసి రైతులకు మేలు చేస్తారన్నారు. ప్రాజెక్టుల మరమ్మతుల విషయంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతారన్నారు. ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సమర్థుడని, బడ్జెట్ సమావేశాల్లో తుంగభద్రకు నిధులు కేటాయిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తుంగభద్ర క్రస్ట్ గేట్లు ఎత్తును 2020-22 మధ్య అడుగు ఎత్తు పెంచారు. 20 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో ఉండే గేట్లను 21 అడుగులకు పెంచారు. కానీ ఈ విషయాన్ని అధికారులు ఎందుకు దాచిపెడుతున్నారని జగదీష్ ప్రశ్నించారు. పెంచిన అడుగులో నీటిని పరిశ్రమలకు ఇస్తే అభ్యంతరం లేదన్నారు. వాస్తవాలు ప్రజలకు వెల్లడించాలన్నారు. ఉంతకల్లు వద్ద రిజర్వాయర్ నిర్మిస్తే రైతులకు ఉపయోగకరమన్నారు. పలువురు సీపీఐ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

'స్ట్రోక్స్'ని నిర్లక్ష్యం చేయవద్దు

● జిల్లా సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ..

బళ్లారి సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పక్షవాతం, గుండెపోటు లాంటి స్ట్రోక్స్‌ను నిర్లక్ష్యం చేయరాదని, సమస్య వచ్చిన వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్ళి తగిన వైద్యం చేయించుకోవాలని జిల్లా సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె సూచించారు. మంగళవారం నగరంలోని అనంతపురం రోడ్డు జిల్లాసుపత్రి ఆవరణలో నిర్వహించిన ప్రపంచ స్ట్రోక్ డే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శారీరక బలహీనత, బ్రెయిన్ ఫెయిల్యూర్ వంటి లక్షణాలతో కూడిన స్ట్రోక్‌ను సరైన సమయంలో గుర్తిస్తేనే చికిత్స సాధ్యమన్నారు. జిల్లా ఆసుపత్రిలో లస్ట్రోసిక్ వ్యాధికి స్పెషలిస్ట్ డాక్టర్, ఫిజికల్ థెరపీ సౌకర్యం ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవనశైలీలో మార్పుల వల్ల ఆరోగ్యంలో ఒడిదుడుకులు ఎదురయ్యే అవకాశం ఉందని, నిత్యం ఆహారం తీసుకోవడం, యోగా-వ్యాయామం తదితర వాటిని పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి మాట్లాడుతూ అధిక రక్తపోటు, మధుమేహం, కళ్లుతిరగడం, రక్తప్రసరణలో మార్పుల లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈసందర్భంగా డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ యోగానందరెడ్డి, బ్రెయిన్ ట్రీట్ మెంట్ సెంటర్ స్పెషలిస్ట్ అండ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాకేశ్, జిల్లా ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ విమలాక్షి, న్యూరాలజిస్ట్ కమల్ కుమార్ జైన్, పెథాలజిస్ట్ ఉదయ్ శంకర్, ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్ దాసప్పనవర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి, పక్కన అభ్యర్థి బంగారు హనుమంత

కాంగ్రెస్‌వి పచ్చి అబద్ధాలు

● నమ్మితే నిలువునా మోసపోతారు : ఎమ్మెల్యే గాలి

బళ్లారి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తోందని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని బీజేపీ నాయకులు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ప్రజలను కోరారు. సండూరు ఉప ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ప్రజలకు ఏ మేలూ జరగడం లేదన్నారు. ఎస్టీ నిగమమండలిలో అవినీతి, ముడా లో అక్రమాలు, ప్రభుత్వ కార్యాయాల్లో నిలువు దోపిడీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేస్తోందని ఆరోపించారు. ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలిచి తీరుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. వీరితో పాటు అభ్యర్థి బంగారు హనుమంత, మైనార్టీ నాయకుడు ఆలీఖన్, మున్నాబాయ్, తదితరులు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిక

సండూరులోని 16వ వార్డులో సుమారు 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వీరికి గాలి జనార్దన్‌రెడ్డి, అభ్యర్థి బంగారు హనుమంత, మైనార్టీ నాయకులు అలీఖాన్, మున్నాబాయ్, దివాకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీతోనే తమకు న్యాయం జరుగుతుందని అందుకే పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం గాలి మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారన్నారు.

స్థానికులకే ప్రజల పట్టం

● కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసీ కొండయ్య



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసీ కొండయ్య

బళ్లారి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల్లో స్థానికులైన తుకారాం అన్నపూర్ణకు ప్రజలు మద్దతు ఇస్తారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ కే.సీ కొండయ్య అభిప్రాయపడ్డారు. సండూరు గనులు దోచుకోవడానికి వచ్చిన కొత్త వ్యక్తులను ఇక్కడి ప్రజలు ప్రోత్సహించరన్నారు. మంగళవారం ఆయన నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గనులను దోచుకున్నవారు మళ్లీ అదే ఆశతో ఇక్కడికి వస్తున్నారని, ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. విలువైన ఖనిజాలతో, ప్రసిద్ధమైన కుమారస్వామి ఆలయంలో సండూరుకు ఎంతో విశిష్టత ఉందన్నారు. 1999లో సోనియాగాంధీ ఎంపీగా పోటీ చేసిన సమయంలో ఆమే బళ్లారి జిల్లా అభివృద్ధికి వేల కోట్లు నిధులు ఇచ్చారన్నారు. కుడితిని వద్ద పవర్‌ప్లాంట్, జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. నాలుగు సార్లు గెలిచిన తుకారాం ఎంతో అభివృద్ధి చేశారని, మరోసారి వారి కుటుంబానికి అవకాశం ఇవ్వాలన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ ప్రచారకర్త వెంకటేశ్ హేగ్డే, కార్పొరేటర్లు అయాజ్, కాంగ్రెస్ నాయకులు రాంప్రసాద్, రాజు, రమేష్, సర్మస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఏడుపడగల నాగప్ప

కంప్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగులచవితి సందర్భంగా మంగళవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. బుక్కసాగర వద్ద వుండే ఏడుపడగల నాగప్పకు పుట్టలో పాలు పోసి భక్తాదులు మొక్కులు సమర్పించుకున్నారు. హంపి యంత్రోత్పాదక ఆంజనేయస్వామికి స్వామికి పూజలు చేపట్టి ప్రత్యేకాలంకరణ చేపట్టారు. బళ్లారి, విజయనగర జిల్లాల్లో నాగుల చవితి సందర్భంగా భక్తులు స్వామికి పాలతో అభిషేకాలు చేపట్టి మొక్కులు సమర్పించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో దీపోత్సవం నిర్వహించారు.



హంపిలో యంత్రోత్పాదక ఆంజనేయస్వామి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

రాయచూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరానికి సమీపంలో పవర్‌గ్రిడ్ కార్పోరేషన్ ఎదురుగా మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. కూలి పని కోసం నగరానికి వస్తున్న కల్లూరు గ్రామానికి చెందిన యువకులు ప్రమాదానికి గురయ్యారు. ఒకే బైక్ పై నలుగురు వస్తుండగా ఎదురుగా వస్తున్న కారొకటి వారు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై నుంచి నలుగురు పడిపోగా వెనక్కి నుంచి వేగంగా వస్తున్న లారీ ఒకటి రోడ్డు పై పడి ఉన్న వారిపై వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కల్లూరుకు చెందిన శరణ బసవ(28), శివు(26) అక్కడికక్కడే చనిపోగా తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు యువకులు గరాబ్, ఇర్ఫాన్‌లను చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాయచూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



శరణ బసవ, శివు(ఫైల్)

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాయచూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రారంభమైన పత్తి కొనుగోలు కేంద్రాలను జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాయచూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ గౌడ సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పలు నిబంధనల ఆధారంగా జిల్లా వ్యాప్తంగా 11 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళ వారం నగరంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8 శాతం తేమ ఉన్న ఎఫ్-80 క్వాలిటీగల పత్తిని రూ.7521 ధరతో కొనుగోలు చేసేందుకు కేంద్రం నుంచి అనుమతి లభించిందన్నారు. రైతులు తేమ శాతం ఎక్కువగా లేకుండా పత్తిని మార్కెట్ కేంద్రాలకు తీసుకోరావాలన్నారు. కాగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న వివరాలను వెల్లడించారు. రైతులు వివరాల కోసం 8801184777కు సంప్రదించాలని సూచించారు.

పురాతన శాసనాలు లభ్యం

బళ్లారి సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హరపనహళ్ళి తాలూకాలోని చిగటేరి గ్రామంలో పురాతన శాసనాలు లభించాయి. చారిత్రక నిపుణుల సహకారంతో 9 శాసనాలను వెలికి తీసినట్లు పరిశోధకురాలు ఎంపీ. వీణా మహంతేశ్ తెలిపారు. విజయనగరం జిల్లా హరపనహళ్ళి తాలూకా కేంద్రానికి 15 కి.మీ దూరంలోని చిగటేరి గ్రామంలోని నారదముని దేవాలయం చుట్టూ బావిహళ్ళి రహదారిపై స్మితారెడ్డి, డాక్టర్.రవి నవలగుండ, సంధ్య సహకారంతో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయగా వివిధ కాలాలకు చెందిన శాసనాలు లభించాయి. వీరేశ్ హులూరు, హిస్టరీ అకాడమీకి చెందిన దాదాపీర్ ఆరు పెద్ద రాతి శాసనాలు, నాలుగు చిన్న రాతి శాసనాలు కనుగొన్నారు. వాటిలో ఒకటి స్తంభంపై కనుగొనబడింది. నారదముని ఆలయ ప్రాంగణంలోని వీరగల్లు 12వ శతాబ్దానికి చెందినది. 1701(క్రీ.శ. 1623) నాటి ఒక శాసనం ఉంది. ఇది బహుశా బగలి పలగర బసవంత నాయకుని కాలానికి చెందిన చిగటేరి శివనప్ప నాయకుని శాసనం కావచ్చన్నారు. నారదముని హైస్కూల్ ప్రక్కనే వామనుని రేఖ డ్రాయింగ్, దేవనాగరి , కన్నడ లిపిలో శాసనాలతో వామన ముద్ర రాయి ఉంది. విజయనగర రాజ్యానికి చెందిన కృష్ణదేవరాయల కాలం క్రీ.శ. 1523నాటి శాసనం లభించింది. రేవణ్ణ ఇంట్లో లింగ ముద్ర, అందులో సన్యాసులకు భూములిచ్చిన రెండు లైన్ల శానసం బయటపడింది.



శాసనం చూపుతున్న చారిత్రక నిపుణులు



చాళుక్యుల కాలం నాటి శాసనాలు

కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలి

● కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్

కంప్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సండూరు నియోజకవర్గంలోని కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ విజయానికి నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పలు గ్రామాల్లో కార్యకర్తలను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం మంత్రి సంతోష్‌లాడ్ కుడితిని మీదుగా వెళ్తుండగా అక్కడున్న కార్యకర్తలు అంజి, రాజశేఖర్ ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలన్నారు. బీజేపీ నాయకులు అబద్ధపు ప్రచారాలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కనికేరి పంపాపతి, కౌన్సిలర్ వెంకటరమణ, లెనిన్, విటోబ, గంగాధర, ప్రతాప్, మోటా తిమ్మ, మల్లి, వెంకటేష్, మాంతేష్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

హోసూరు జోన్

పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజలో ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

హోసూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గం హోసూరు పంచాయతీ యూనియన్ కొత్తకొండపల్లి పంచాయతీ, బొమ్మండపల్లి పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూలో పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. చిల్డ్రన్స్ గార్డెన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ 2024-25 క్రింద రూ.35.90 లక్షలతో 2 తరగతి గదులను నిర్మించనున్నారు. ఎమ్మెల్యే వై.ప్రకాశ్, కౌన్సిల్ అధ్యక్షుడు మునిరాజ్, అశోక్‌కుమార్, నారాయణప్ప, ప్రభుత్వ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, డీఎంకే నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై ఇరుక్కున్న వ్యక్తికి చికిత్స

హోసూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపం కెలమంగలం సాయిబాబా ఆలయం ముందు హైవోల్టేజీ విద్యుత్ లైన్ స్తంభం ఉంది. స్థానికంగా స్టేషనరీ దుకాణం నిర్వహిస్తున్న ప్రేమ్‌రాజ్ (40) సోమవారం రాత్రి అక్కడికి వెళ్లి పైఅంతస్తులో ఉన్న పైప్‌లకు మరమ్మత్తు పనులు చేయడానికి వెళ్లాడు. హఠాత్తుగా కాలుజారి పక్కనే ఉన్న హై వోల్టేజీ విద్యుత్ తీగపై పడిపోవడంతో విద్యుదాఘాతానికి గురైయ్యాడు. అధిక ఓల్టేజ్ కారణంగా వెంటనే కనెక్షన్‌ను ఆఫ్ చేయడం సాధ్యం కాలేదు. కొద్ది సేపటికి చుట్టుప్రక్కల వారు వెంటనే అతడు చిక్కుకున్న తీగలను తీసివేశారు. అయితే ఈ సందర్భంగా ప్రేమ్‌రాజ్ నడుము కిందిభాగం చాలా దెబ్బతింది. చికిత్స నిమిత్తం కెలమంగలం ప్రభుత్వ ఆసుపత్రికి చేర్పించారు. శరీరం 60 శాతానికి పైగా కాలిపోయిందని డాక్టర్లు తెలిపారు. అనంతరం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తరలించారు.

విద్యాశాఖ మంత్రి తనిఖీ

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా బర్గూరు పంచాయతీ యూనియన్‌లోని అంజూరు, జగదేవి ప్రభుత్వ హయర్ సెకండరీ పాఠశాలను రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించారు. స్వయంగా పుస్తకాలు పరిశీలించి విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థిని ప్రశ్నిస్తున్న మంత్రి అన్బిల్ మహేశ్

క్యారెట్ కిలో రూ.100

హోసూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతం పలు రకాల కూరగాయల సాగుకు ప్రసిద్ధి. స్థానికంగా పండించే క్యారెట్ కిలో రూ.60 - రూ.70 ధర పలుకుతుండగా ఊటీ క్యారెట్ రకం కిలో రూ.100 ధర పలుకుతోంది. క్యారెట్ సాగుకు ఎకరాకు దాదాపు రూ.80 వేలు ఖర్చు అవుతుంది. దిగుబడి బాగుంటే ఎకరాకు 100 - 200 కిలోలు సాధ్యం. గిట్టుబాటు ధర లభిస్తే రైతులకు లాభం ఉంటుంది. ఒక్కసారి కిలో రూ.10 - రూ.20 వరకు విక్రయించిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం హోసూరు రైతు బజారులో క్యారెట్ రూ.60 - రూ.70 మధ్య విక్రయిస్తున్నారు. రెండు నెలల క్రితం క్యారెట్ కిలో రూ.20 కి విక్రయిస్తుండగా ప్రస్తుతం పంట దిగుబడి ఉన్న రైతులకు ఆశాజనకమైన ధరతో లాభం గడిస్తున్నారు. ఊటీ క్యారెట్ రూ.100 చొప్పున విక్రయిస్తున్నట్టు రైతులు సంతోషంగా తెలిపారు.



పనిచేయని నీటిశుద్ధి కేంద్రాలు

హోసూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రమైన కర్ణాటక రాజధాని బెంగళూరు తర్వాత హోసూరు నగరం కూడా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో ఏడో స్థానంలో ఉంది. హోసూరు కార్పొరేషన్‌లో 45 వార్డులు ఉండగా కేవలం 14 శుద్ధతాగునీటి కేంద్రాలు ఉన్నాయి. కొన్ని కేంద్రాలు పనిచేయడం లేదు, మరి కొన్ని చోట్ల సరైన సేవలు లభించక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మరిన్ని శుద్ధ తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. హోసూరు నగరంలో పలు చోట్ల తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదనే విమర్శలు పెరిగాయి. రైతు బజారు వెనుక ఉన్న ఆర్ ఓ ప్లాంట్‌తోపాటు కొన్ని చోట్ల గత మూడు నెలలుగా తాగునీరు అందడం లేదని తెలుస్తోంది. డిమాండ్‌కు అనుగుణంగా తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలను బాగు చేయడంతోపాటు అవసరమైన చోట్ల స్థానికులకు వీలుగా నిరంతరం కొనసాగేలా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. హోసూరు ప్రాంతంలో 3వేలకుపైగా చిన్నా, పెద్ద ఫ్యాక్టరీలు ఉన్నాయి. 2 లక్షల కంటే ఎక్కువమంది కార్మికులు ఉన్నారు. అధికారులు, నేతలు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.